# మాయదారి కడుపు

నిజానికి లక్ష్మి తొందర పడవలసిన అవసరం ఎంత మాత్రమూ లేదు. తల్లీ తండ్రీ పిల్లకు తిరిగి వివాహం చేద్దామనే సంకల్పంతోనే ఉన్నారు. హృదయాలెట్లా ఉన్నవో ఎవరూ చూడలేరు కదా! పైకి చుట్టపక్కాలంతా తప్పక లక్ష్మికి పెళ్ళి చెయ్యవలసిందనే సెలవిచ్చారు. చక్కని చుక్కలాటి పిల్ల, మొగుణ్ణి సుఖపెట్టగల నేర్పరి. ఇంటిపనులు తనంతట చక్క పెట్టుకుపోగల యిల్లాలు కాదగ్గది. చదువుకున్నది, నిదానం కలది, తెలివిగలది, ప్రతి దానికి అడ్డంగా పుల్లల్లే పొడుచుకు రాదు— అన్ని విధాలా సంఘంలో స్థానం పొందదగిన మనిషి, అటువంటిది పెళ్ళాడి పిల్లల్ని కనకపోతే యింకెవరు కంటారు?

సామాన్యంగా వితంతు వివాహాలకు తటస్థించే చిక్కు కూడా లేదిక్కడ; ఏ అపభ్రంశపు వివాహార్థుడు దాపరిస్తాడో అని కూడా భయంలేదు.

కాశీ విశ్వవిద్యాలయంలో మైనింగ్ మెటలర్జీ మూడో సంవత్సరం చదువుతున్న భగవాన్లు తననోటిమీదుగా అడిగాడు లక్ష్మిని తన కిమ్మని. అతనూ చిన్నవాడు, పెద్దచదువు చదవటంచేత కాస్త పటాటోపంగా కనిపిస్తాడు, కాని చాలా సంసార పక్షం మనిషి. ఇప్పటి కాలపు చదువుకున్న వాళ్ళల్లే మనుషులను ముళ్ళమీద ఉన్నట్లు చేసేవాడు కాడు. సాధువు, ఎప్పటికైనా నూరు నూటయాభై రూపాయల ఉద్యోగం అవలీలగా సంపాదించ గలవాడు. ఉన్న ఊళ్ళో ఉద్యోగం దొరక దంటారూ? ఉండి చేస్తున్నవాళ్ళు బావుకున్నదేమిటి?

నేనన్నట్టు ఇటువంటప్పుడు లక్ష్మి తొందరపడవలసిన విషయం ఏమీ లేదు. కాని లక్ష్మి తొందరపడటంలో అట్లా ఇట్లా కాకుండా బొక్కబోర్లా పడ్డది. ఏదైనా దాగుతుంది కాని దొంగతనమూ రంకుతనమూ దాగవు సుమండీ!

నరసయ్యా సోమమ్మగార్లు వంటింట్లో కాబినెట్టు మీటింగు పెట్టారు.

"ఇదెక్కడి ప్రారబ్ధమండీ!" అంది సోమమ్మ.

"ఇదేం కర్మమే!" అన్నాడు నరసయ్య.

"ఇదెక్కడ దాపరించిందండీ!"

"ఇదికూడా ఎక్కడ దాపరించిందే!"

ఈ విధంగా కాస్సేపు ఒకరొకరినొకరనుకరించుకున్నారు. ఉన్నసంగతేమిటో లోపల ఇద్దరికీ దిగులుకన్న వివరాలు తెలుసుకోవాలనే యావ జాస్తిగా ఉంది. మెల్లిగా నరసయ్యే బయటపడ్డాడు.

"అయితే నిజమేనంటా?"

"అయ్యో! మీరెంత అమాయకులండీ! ఆ పొట్ట కనిపించటంలేట్టండీ బీరకాయల్లే!"

"మరయితే వేవిళ్ళు అవీ—"

"అవునూ! మొన్నమొన్నటివరకూ దాని డోకులూ, వాంతులూ ఏమిటండీ!"

"పైత్యవన్నాడే నంబాయన!"

"నంబాయన బతుకూ సరే నా బతుకూ సరే!"

నరసయ్య కింకో ప్రశ్నకూడా వెయ్యాలని ఉంది. అసలదే ముఖ్యమైన విషయం. కాని అది వేసేస్తే తన భార్య ఎట్లా భావిస్తుందో?

"ఇంతకూ— అదంతా అట్లా ఉంచి— మనలో మాట— కనుక్కోటం కష్టమేననుకో—"

సోమమ్మ మొగుడి ప్రశ్నను సగం వూహించి రానిమ్మన్నట్టు తల ఊపింది. నరసయ్యకూడా ఇక నిగ్రహించలేక "ఎవరై ఉంటారు?" అనేశాడు.

సోమమ్మ దివ్యమైన సినిమా యాక్షన్ చేసింది. మొదట అర్థం కానట్టు నటించింది. తరవాత తెల్లబోయింది. మళ్ళీ వెంటనే అభిప్రాయం మార్చుకుని ఎర్రబోయింది. మళ్ళీ మొగుడివంక చూసి తిరిగ్గా కళ్ళనీళ్ళు పెట్టింది. నరసయ్య కంగారుపడ్డాడు.

"ఎవరే? ఎవరే?" అన్నాడు మొగుడు. ఏదో కొంప లంటుకునే రహస్య మనుకున్నాడు పెళ్ళాం కంగారు చూసి ఆ కంగారంతా ఏమిటంటే సోమమ్మకు అనుమానించేందుకు ఒక్క మొగముండా కొడుకు పేరుపెట్టి ఏడవలేదు విశ్వ ప్రయత్నం చేసినా.

చివరకు మెల్లిగా "భగవాన్లు!" అంది. నరసయ్య ప్రాణం కుదుటబడ్డది. ఒక దీర్ఘ నిశ్వాసం విసర్జించాడు.

"భ గ-వా-న్లే-క-దా! ఫరవాలేదు. ఎట్లాగో వాడికే అది రాసిపెట్టుండె. ఫరవాలేదు, మరేమీ ఫరవాలేదు....కాని ఒసే! ఎన్నో నెలంటావు? మూడా? వాడు వెళ్ళినాక ఇది బయటుండెను గాదుటే! హోసి పిచ్చిముండా! వా డీసారి వచ్చినప్పుడిక్కడ రెండురోజులే కాదుటే ఉంది? నీ తెలివి తగలడ్డట్టే ఉంది!" ఒక్కసారి నరసయ్యకు పెళ్ళాం తెలివి తేటలను గురించి కనువిప్పయింది. ఈ పాడెగట్టితో పనికాదు తనంతట తనే ఆరా తియ్యాలని తీర్మానించుకున్నాడు.

మర్నాడుదయం కూతురు ఏకాంతంగా దొరుకుతుందేమోనని పిల్లల్లే ఇంటి చుట్టూ దొడ్డిచుట్టూ తారాడాడు. తల్లికి తెలీకుండా కూతురితో మాట్లాడాలి. అందుకూ అంత అవస్థ. చివర కెట్లాగైతేనేం కూతుర్ని ఒంటరిగా అటకాయించి "ఎవడే, అమ్మాయి!" అని అడిగాడు.

లక్ష్మి తెల్లమొహం వేసి "ఏమిటి ఎవడు?" అంది.

నరసయ్య చిన్నబుచ్చుకున్నాడు. తన్ను సమాధానం చెప్పటానికి వీల్లేని ప్రశ్నలు వెయ్యటంలో లక్ష్మి గట్టిది. ఇది ఎంతమాత్రము బాగాలేదు. కొంత మంది మాట్లాడటం చేతగాని వాళ్ళిటువంటి ప్రశ్నలే వేస్తారు. ఏమిటి ఎవడేమిటి? అసహ్యంగా! ఏమిటి ఎవడుట! ఏమిటి ఎవడు! ఆ ప్రశ్న చాలనట్టు "నీకేమైనా మతి చెడ్డదా ఏమిటి?" అని లక్ష్మి చక్కాపోయింది. నరసయ్య చేసిన భగీరథ ప్రయత్నం కాస్తా బుగ్గయింది. లక్ష్మి ఇట్లా లోపలికి వచ్చిందో లేదో తల్లి రహస్యంగా వంటింట్లోకి పిలిచి "ఎవడే అమ్మాయి" అంది.......

వంటింట్లో కూతురు కేకవేస్తున్నది తన్ను గురించే నని దొడ్లోనించి నరసయ్య నిశ్చయపరుచుకున్నాడు. ఆయన కాళ్ళు చల్లబడినై, "రామరామ ఈ ఆడవాళ్ళుండే...."

"అమ్మాయి చెప్పటం లేదండీ! పైగా నన్ను తేకవేసింది. పాడు పనిచేసి పైగా నోరు చేసుకుంటుంది కూడాగద! ఎక్కడి పాపకర్మమో! మరీ ఇంత కలియుగమా!"

"నువ్వేమన్నావేం?"

"ఎవడే అమ్మా అని బుజ్జగించి అడిగితే– ఇరుగూ పొరుగూ వినిపోతారని మెల్లిగా వంటింట్లోకి పిలిచి అడిగానండోవ్!– ఆపళంగా అరవటం మొదలు పెట్టింది. ఇంత అఘాయిత్య మ్మనిషిని నే నెక్కడా చూళ్ళేదూ!"

"ఎవ్వడే?"

"పొద్దున్నే నండీ!"

నరసయ్య మనస్సు కుదుటపడ్డది. ఇటువంటి పన్లు జరిగినప్పుడు పెద్ద ముండాకొడుకుల కింత కష్టం ఉందనే శాస్త్రిల్లో ఇటువంటి పనులు నిషేధించారు. తప్పకుండా! ఈ పని పెళ్ళాంవల్ల కాదని తేలిపోయింది– మరోసారి.

"నన్ను చూడు!" అని నరసయ్య పెళ్ళాం దగ్గిర్నించి కూతురున్న గదికి నిష్క్రమించాడు.

కాస్సేపటి కావైపునించి పెద్ద ధ్వని వినపడ్డది సశబ్దస్తుములో భవత్. చెవులు రిక్కించి వింటున్న సోమమ్మ గుండె లవిసిపోయినై.

ఆ రాత్రి మళ్ళీ వంటింట్లో కౌన్సిలాఫ్ వార్ జరిగింది.

"ఏం చేద్దాం?"

"అదే నేనూ అడగబోతున్నాను. ఏం చేద్దాం?"

"నిజమే ననుకోండి. ఏంచేద్దా మిప్పుడు?"

"కనకనే, నే నంటున్నది, ఏం చెయ్యా లిప్పుడు?"

"డాక్టర్ను పిలిచి–"

"ఆడ డాక్టర్ని–"

"అవును. రహస్యంగా–"

"నిజమే మరో పదిరూపాయలు జాస్తిగా చేతిలో పెట్టి–"

"కడుపు కాస్తా–"

"తీయిం చేసేద్దాం!"

ఇద్దరి మొహాలు చాటంతయినై.

ఊళ్ళో ఒకతే లేడీ డాక్టరు.

నరసయ్య ఆదుర్దాలో "దారి స్త్రీలకు మాత్రము" అన్న చెక్క చూడకుండా జొరబడ్డాడు. కాని లంఖిణి అడ్డుపడనే పడ్డది.

"ఎవరండీ మీరు?" అన్నది లంఖిణి.

"నేనా?_ నేను_" పైన నరసయ్యకు మాట రాలేదు.

"ఇది ఆడవాళ్ళ ఆసుపత్రి."

"అయితే నేనేమిటనుకున్నావు?" అన్నాడు నరసయ్య. అంటే ఆయన ఉద్దేశం ఆడదాని పనిమీదే వచ్చానని.

"మీరు లోపలికి వెళ్ళటానికి వీల్లేదు!" అంది లంఖిణి.

"అయితే ఎట్లా?" అన్నాడు నరసయ్య.

"మీ విజిటింగ్ కార్డివ్వండి?"

"అంటే?"

"చచ్చాను. మీ పేరేమిటి?"

"నరసయ్య!"

"ఇంటి పేరు?"

చచ్చినా జ్ఞాపకం రాలేదు నరసయ్యకు. ఇంటి పేరేదైనా ఉంటే నరసయ్య ఆ క్షణంలో దాన్ని పూర్తిగా మరిచిపోయినాడు.

లంఖిణి ఏకో సణుగుతూ నిష్క్రమించింది.

లేడీ డాక్టరు రహస్యంగా పని చెయ్యాలి కనక నూరు రూపాయలు ఫీజడిగి యాభై అడ్వాన్సు కోరింది. అంత డబ్బు తన దగ్గిర లేదన్నాడు. తన చికిత్స మాత్రం పెరట్లో కాస్తున్నదా ఏమిటని అడిగింది డాక్టరు. మొత్తం యాభై రూపాయలు. అంతా ముందే ఇచ్చేట్టు స్థిరమైంది. నరసయ్య చావు తప్పి కన్ను లొట్టపోయినా డాక్టర్ను వెంట పెట్టుకు మరీ వచ్చాడు.

డాక్టరు లోపలికి వెళ్ళింది పిల్లను పరీక్ష చెయ్యటానికి. దంపతు లిద్దరూ పర్యవసానం కోసం నిరీక్షిస్తున్నారు.

ఒక అరగంట దాటిన తరవాత లేడీ డాక్టరు బయటికి వచ్చింది. లంఖిణి ఏదో పనిమనిషి పేరే పెట్టి పిలిచింది. యాభై రూపాయలు ముట్టిన సంగతి తెలుసుకుంది. నరసయ్యవైపు తిరిగి "పిల్లకు కడుపులో బల్ల. పట్నం పంపించండి!" అని వెళ్ళిపోయింది.

నరసయ్యా సోమమ్మా ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. నరసయ్య పెళ్ళాన్ని ఏదో ఫెడేలున అందామన్నట్టు చూశాడు. కాని ఆయన నోట మాట రాలేదు. నేను మొదటనే చెప్పలా అన్నట్టు సోమమ్మ మొగుడి వంక చూచి కూతుర్ని ఓదార్చబోయింది.

(ప్రథమ ముద్రణ : మార్చి 1935, వినోదిని)